క్లుప్తంగా

సేవా భూషణ్ పురస్కారానికి శివశంకర్ ఎంపిక



తెనాలి: అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవం సందర్భంగా కాకినాడకు చెందిన హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్, పట్టణానికి చెందిన సంఘ సేవకుడు తన్నీరు శివశంకర్‌కు సేవా సామ్రాట్ పురస్కారంతో సత్కరించనుంది. పలు సేవా సంస్థలను స్థాపించి గత పాతికేళ్లుగా వివిధ సామాజిక సేవలను అందిస్తుండటాన్ని ప్రామాణికంగా తీసుకుని ఈ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.స్వామినాయుడు తెలియజేశారు. హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు, వ్యవస్థాపకుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లైంగిక వేధింపుల నిరోధక కమిటీ సభ్యుడు డాక్టర్ బొడ్డపాటి దాసు పర్యవేక్షణలో కాకినాడలో ఈనెల 10న ఉదయం 10 గంటలకు జరిగే ప్రత్యేక సభలో ఈ పురస్కారాన్ని బహూకరిస్తారని వివరించారు.

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష



తెనాలి అర్బన్: జాతీయ ఉపకార వేతనాల పరీక్ష(ఎన్ఎంఎంఎస్) ఆదివారం తెనాలి పట్టణంలో జరిగింది. పట్టణంలోని ఎన్వీసీ ఆర్ఎన్ఎంహెచ్ స్కూల్, దొడ్డపనేని ఇందిర బాలికల హైస్కూల్, టీఎస్ఆర్ఎంహెచ్ స్కూల్, కెఎస్ఎంహెచ్ స్కూల్, బాయ్స్ హైస్కూళ్లలో ఉదయం 10 గంటల నుంచి ఒంటిగంట వరకు పరీక్ష జరిగింది. ఎనిమిదో తరగతి చదువుతున్న 917 మంది దరఖాస్తు చేసుకోగా 852 మంది హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని చెప్పారు. పరీక్షలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు పర్యవేక్షించారు.

ముగిసిన సుబ్రహ్మణ్యస్వామి బ్రహ్మోత్సవాలు



తెనాలి రూరల్: తెనాలి మండలం పెదరావూరులోని మహావిద్యా పీఠంలో నిర్వహిస్తున్న జగద్గురు ఆదిశంకరాచార్య సహిత అభయ హస్త సుబ్రహ్మణ్యస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. విద్యాపీఠం వ్యవస్థాపకుడు చింతపల్లి సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో ఈ నెల 4న ప్రారంభమైన బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా ఉదయం 11.30 గంటలకు పూర్ణాహుతి అవబృదం నిర్వహించారు. కార్యక్రమాలను చింతపల్లి దత్తు శర్మ, శుభం శర్మ, రామకృష్ణ, నరసింహమూర్తి శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామికి మహా హారతి, భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో స్వామి భక్తులు, శ్రీ మహా విద్యాపీఠం కార్యవర్గం సభ్యులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

కొల్లిపర: మండల కేంద్రం కొల్లిపరలో రహస్యంగా పేకాడుతున్న ఆరుగురిని ఆదివారం అదుపులోకి వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.కోటేశ్వరరావు తెలిపారు. వారి నుంచి రూ.6540 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మండలంలో ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే ప్రజలు స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

నత్తే నయం

- నాలుగు నెలల నుంచి నిలిచిన క్రిటికల్ కేర్ యూనిట్ భవన నిర్మాణం
- చెల్లింపుకు నోచుకోని రూ.3.4 కోట్లు
- ఆరు నెలలు దాటినా దొరకని గ్రావెల్
- చేతులు ఎత్తేసిన కాంట్రాక్టర్



తెనాలిలో నిర్మాణంలో ఉన్న క్రిటికల్ కేర్ యూనిట్ భవనం

తెనాలి అర్బన్: తెనాలిలో నూతనంగా నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్ భవన నిర్మాణం రెండు అడుగులు ముందుకు.. అయిదు అడుగులు వెనక్కి అనే చందాన సాగుతోంది. దీని నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసినా రాష్ట్ర ప్రభుత్వం వాటిని కాంట్రాక్టర్‌కు చెల్లించకుండా చోద్యం చూస్తుండటంతో పనులు నాలుగు నెలల నుంచి పూర్తిగా నిలిచిపోయాయి. అంతేకాకుండా బేస్ మట్టంలో నింపేందుకు అవసరమైన గ్రావెల్‌ను కూడా అధికారులు సమకూర్చకపోవడంతో ఏం చేయాలో తెలియని స్థితిలో కాంట్రాక్టర్ కొట్టుమిట్టాడుతున్నాడు.

నిధులు ఇచ్చిన కేంద్రం

తెనాలి జిల్లా వైద్యశాల ఆవరణలో 100 పడకల క్రిటికల్ కేర్ యూనిట్‌ను నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం భావించి అందుకు అవసరమైన అనుమతులు ఇచ్చింది. నిర్మాణం కోసం రూ.45 కోట్లు కూడా కేటాయించింది. స్థల కేటాయింపు, పాత భవనాలు కూల్చివేత వంటి పనులు పూర్తి చేసుకుని 2023 డిసెంబర్‌లో హైదరాబాద్ కు చెందిన ఎలిక్సర్ మిట్ ఫాం ప్రవేట్ లిమిటెడ్ సంస్థ పనులు ప్రారంభించింది. బేస్ మట్టం వరకు నిర్మించింది.

నిధుల కేటాయింపులు ఇలా...

క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం కేటాయించిన రూ.45 కోట్లలో రూ.22 కోట్లు భవన నిర్మాణ పనులకు కేటాయించారు. మిగిలిన నిధులు అపరేషన్ థియేటర్‌లో, క్యాజువాలిటీలలో వస్తువుల కొనుగోలు, వార్డులలో మౌలిక వసతుల కల్పనకు ఉపయోగించనున్నారు. గ్రౌండ్ ఫ్లోర్ కాకుండా నాలుగు ఫ్లోర్‌లతో దీనిని నిర్మించనున్నారు.

ఎర్రమట్టిని సరఫరా చేయని అధికారులు

భవనం బేస్ మట్టం వరకు పూర్తయింది. దాని మధ్యలో ఎర్రమట్టి(గ్రావెల్) పోయాల్సి ఉంది. దాన్ని గుంటూరు రోడ్డులోని క్వారీ నుంచి తెచ్చుకోవాలని ప్రభుత్వం సూచించింది. మట్టిని సమకూర్చాలని రెవెన్యూ అధికారులను ఆదేశించింది. దీంతో కాంట్రాక్టర్ చేబ్రోలు మండల పరిధిలోని రెవెన్యూ అధికారులను ఆరు నెలల నుంచి కోరుతూ వస్తున్నారు. క్వారీలు మూసివేయడం వల్ల ఎర్రమట్టిని సరఫరా చేయలేకపోతున్నామని అధికారులు చెబుతున్నట్లు కాంట్రాక్టర్ తెలిపారు. మట్టి దొరికే వరకు తాము ఏమి చేయలేమని, దాని స్థానంలో నల్లమట్టి వేసే వెసులుబాటు తమకు లేదని చెబుతున్నారు. ప్రభుత్వ భవనాలకు కూడా సకాలంలో అధికారులు గ్రావెల్‌ను సరఫరా చేయకపోతే నిర్మాణాలు ఎలా చేస్తామనే ఆవేదనను వారు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి వెంటనే బిల్లుల చెల్లింపులతో పాటు గ్రావెల్‌ను సరఫరా చేసే విధంగా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కూటమి ప్రభుత్వ పక్షపాతం ?

పనులు చేస్తున్న ఎలిక్సర్ మిట్ ఫాం ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ. నాలుగు కోట్ల పనులు పూర్తి చేసింది. గ్రౌండ్ ఫ్లోర్ నిర్మాణానికి అవసరమైన మట్టిని తవ్వి పిల్లర్స్ నిర్మించింది. కొంత మేర గోడలు నిర్మించారు. దీనికి సంబంధించిన రూ.3.4కోట్ల బిల్లులను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేశారు. కానీ ప్రభుత్వం నిధుల చెల్లింపులు చేయకుండా ఆపివేసింది. కేంద్రం నుంచి నిధులు వచ్చిన వాటిని చెల్లించడంలో జాప్యం చేస్తున్నట్లు సమాచారం. దీంతో కాంట్రాక్టర్ పనులను నాలుగు నెలల నుంచి పూర్తిగా నిలిపివేశారు.



బేస్ మట్టం మధ్యలో నిలిచిన వర్షపు నీరు

క్రిటికల్ కేర్ యూనిట్‌లో ఉండే విభాగాలు ఇవి..

ఇంటెన్సివ్ కేర్ యూనిట్(ఐసీయు) విభాగాన్ని 20 పడకలతో (చిన్నపిల్లలకు అవసరమైన నాలుగు బెడ్‌లు కలిపి) ఏర్పాటు చేయనున్నారు. హైడిఫినిషిన్ యూనిట్(హెచ్‌డీయు)-20 పడకలు, ఐసోలేషన్ వార్డు-30 పడకలు, ఐసోలేషన్ గదులు-12, డయాలసిస్ బెడ్‌లు-4, ఎంసీహెచ్(బాలింతలకు)-4 బెడ్‌లు, అత్యవసర విభాగం -10 పడకలతో నిర్మించనున్నారు. ఇవి కాకుండా మూడో అంతస్తులో రెండు ఆపరేషన్ థియేటర్‌లను ఏర్పాటు చేయనున్నారు.

చర్యలు తీసుకుంటాం



తెనాలి జిల్లా వైద్యశాల ఆవరణలో నిర్మిస్తున్న అత్యాధునిక క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణ పనులు నిలిచినట్లు నా దృష్టికి వచ్చింది. ఎందుకు పనులు నిలిపివేశారు ? అనే దానిపై అధికారులతో మాట్లాడతాను. పనులు పునఃప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవడంతో బిల్లుల చెల్లింపులో జరిగిన జాప్యాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తాం. బిల్లులు చెల్లింపులు జరిగే విధంగా చూస్తాం. గ్రావెల్‌ను కూడా సరఫరా చేసే విధంగా రెవెన్యూ అధికారులతో మాట్లాడతాను.

–డాక్టర్ మజీదా బేగం, జిల్లా కో–ఆర్డినేటర్, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్

ఆలయాలను ప్రభుత్వ నియంత్రణ నుంచి విముక్తం చేయాలి

హిందూ చైతన్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి మారుతీరామ్

తెనాలి: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 5న జరగనున్న హైందవ శంఖారావం సభకు తెనాలి నుంచి ప్రజలు భారీగా తరలిరావాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. స్థానిక రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కార్యాలయంలో ఆదివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ తెనాలి నగర సంఘ చాలక్ ఇల్లూరు సత్యనారాయణ అధ్యక్షత వహించారు. హిందూ చైతన్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి మారుతీరామ్ మాట్లాడుతూ దేవాలయాలను ప్రభుత్వ నియంత్రణ నుంచి విముక్తం చేసి, స్వయంప్రతిపత్తి కలిగిన ఉత్తమ ధార్మిక వ్యవస్థకు అప్పగిస్తూ వెంటనే చట్టసవరణ చేయాలనీ విశ్వహిందూ పరిషత్ జాతీయోద్యమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఇందులో భాగంగానే జనవరి 5న వియవాడలో గన్నవరం విమానాశ్రయానికి దగ్గర్లో లక్షలాది మందితో బహిరంగసభ జరగనుందని తెలిపారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు రెడ్డి వెంకటప్పారెడ్డి, నగర కార్యదర్శి రామాంజనేయులు, ఆర్ఎస్ఎస్ నగర కార్యనిర్వాహక త్రిపురమల్లు హనుమత్‌ప్రసాద్, బీజేపీ, న్యాయవాద పరిషత్, బీఎంఎస్, విద్యాభారతి, ఏబీవీపీ, రాష్ట్ర సేవికా సమితి, హిందూ చైతన్యవేదిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్తమ కమ్యూనిస్టు గాదె సుబ్బారెడ్డి



మాట్లాడుతున్న పుణ్యవతి

తాడేపల్లిరూరల్ : చివరి శ్వాస వరకు ఎర్ర జెండా కింద నిలిచి, కళా రంగంలో విశిష్ట సేవలందించి గాదె సుబ్బారెడ్డి ఉత్తమ కమ్యూనిస్టుగా నిలిచారని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి అన్నారు. ప్రజా నాట్య మండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాదె సుబ్బారెడ్డి సంస్మరణ సభను ఆదివారం సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.రవి అధ్యక్షతన సీఎస్ఆర్ కల్యాణ మండపంలో నిర్వహించారు. గాదె సుబ్బారెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పుణ్యవతి మాట్లాడుతూ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో పార్టీ ఆదేశాల మేరకు బాధ్యతలను త్రికరణ శుద్ధిగా నెరవేర్చేవారని, ప్రజా నాట్యమండలి రాష్ట్ర నాయకుడిగా అనేక కళారూపాలను తీర్చిదిద్దడంలో ఆయన కృషి ఎనలేనిదన్నారు. సీపీఎం పూర్వ రాష్ట్ర కార్యదర్శి పి.మధు మాట్లాడుతూ సుబ్బారెడ్డి మరణం ప్రజాతంత్ర ఉద్యమానికి, సాంస్కృతిక రంగానికి తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో సుబ్బారెడ్డి సతీమణి శివలీల, కుమార్తెలు శిరీష, ఆషాదేవి, కృష్ణాజిల్లా మాజీ ఎంఎల్‌సి వై.వి.బి. రాజేంద్రప్రసాద్, ప్రజా నాట్యమండలి తెలంగాణ రాష్ట్ర నాయకులు పి.దేవేంద్ర, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, ప్రముఖ సినీ నటులు అజయ్ ఘోష్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్. అనిల్ కుమార్, శ్రీకాంత్ రెడ్డి, శివనాగేంద్రరెడ్డి , వివిధ ప్రాంతాల కళా రంగంలో పనిచేస్తున్న వారు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడికి ఆత్మీయ సత్కారం



మృత్యుంజయరావు దంపతులకు సత్కారం

తెనాలి: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డును ఇటీవల స్వీకరించిన పి.మృత్యుంజయరావు(జయ మాస్టారు)కు ఆదివారం సాయంత్రం తెనాలిలో ఆత్మీయ సత్కారం చేశారు. స్థానిక గంగానమ్మపేటలోని చారిత్రక ప్రసిద్ధి చెందిన శ్రీపర్వతవర్ధినీ సమేత శ్రీరామేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలో ఏర్పాటైన సభకు ఉపాధ్యాయ సంఘం 'ఆపస్' బాపట్ల జిల్లా అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసకుమార్ అధ్యక్షత వహించారు. ఆదిశైవ సంఘం, తెనాలి ఆధ్వర్యంలో జరిగిన సభకు ప్రముఖ శైవాగమ పండితుడు మామిళ్లపల్లి మృత్యుంజయ ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉపాధ్యాయ ప్రముఖుడైన మృత్యుంజయరావు విద్యార్థులను తీర్చిదిద్దుతూ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయి రిసోర్స్‌పర్సన్‌గా పనిచేస్తూ వందల మంది ఉపాధ్యాయులకూ శిక్షణనిచ్చారని వక్తలు అభినందించారు. గత 22 ఏళ్లుగా హోమియో ఉచిత సేవాకేంద్రాన్ని నిర్వహిస్తూ వేలాదిమందికి ఆరోగ్య సేవలను అందించటం గొప్ప విషయమని ప్రశంసించారు. జయ మాస్టారు గతంలో రోటరీ క్లబ్, బ్రాహ్మణ పరిషత్ అవార్డులతోపాటు నియోజకవర్గ, జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందుకున్నారని వక్తలు గుర్తుచేశారు. స్వర్ణ హరికృష్ణ స్వాగతం పలికిన సభకు ఎన్.చిరంజీవి వందన సమర్పణ చేశారు.

మస్జిద్-ఎ-అర్కమ్ హుదా మసీదు ప్రారంభం



మాట్లాడుతున్న మౌలానా షేక్ ముస్తాఖ్ అహ్మద్

తెనాలి: పట్టణ బుర్రిపాలెంరోడ్డులోని బీసీ కాలనీలో ఆదివారం మస్జిద్-ఎ-అర్కమ్ హుదా పేరుతో నూతన మసీదును ప్రారంభించారు. మౌలానా మసూద్ ఆధ్వర్యంలో తొలి నమాజు చదివారు. రాష్ట్ర ఇమానే కమిటీ, హుదా సొసైటీ సంయుక్త పర్యవేక్షణలో దాతల సహకారంతో ఈ మసీదును నిర్మించారు. ప్రారంభ సభకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా షేక్ ముస్తాఖ్ అహ్మద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రతిఒక్కరూ అల్లా మార్గంలో నడుస్తూ జీవితాన్ని సార్థకం చేసుకోవాలని ఆయన సూచించారు. మనిషి జీవితం క్షణభంగురమనీ, శ్వాస పీల్చుకుని విడిచేలోపు జీవితం ఉంటుందో లేదో అగమ్యగోచరమని చెప్పారు. అందువల్ల అల్లాను స్మరిస్తూ సన్మార్గంలో నడుస్తూ, ఆదర్శవంతమైన జీవితాన్ని గడపాలని తెలిపారు. హుదా సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు హజరత్ మౌలానా మొహమ్మద్ అబ్బాస్‌ఖాన్ నద్వీ మాట్లాడుతూ దయ, కరుణ, నైతికవిలువలతో జీవితాన్ని గడపాలనీ, అంతా సోదరభావంతో ఐకమత్యంతో జీవిస్తూ ప్రపంచశాంతికి కృషిచేయాలని చెప్పారు. రాష్ట్ర ఇమానే మజ్లీస్ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ ఫరీద్, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ మొహమ్మద్ ఇస్మాయిల్, సిరాజుద్దీన్, షేక్ సత్తార్, అతావుల్లా, హాఫీజ్ అబ్దుల్ కరీం, ముఫ్తీ ముజాహిద్, వినుకొండ కౌన్సిలర్ ఎంఎస్‌కే బాషా పాల్గొన్నారు.

ఇద్దరు సాహితీవేత్తలకు 'తెలుగు తేజం' పురస్కారాలు



జాతీయ పురస్కారంతో ప్రజ్ఞాచారి



భీమేశ్వరప్రసాద్‌కు సత్కారం

తెనాలి/ తెనాలి రూరల్ : ప్రకాశం జిల్లా మార్కాపురం పట్టణంలోని గొల్ల సత్యనారాయణ కల్యాణ మండంలో ఆదివారం జరిగిన ఆదరణ వెల్ఫేర్ సొసైటీ దశమ వార్షికోత్సవ సభలో తెనాలికి చెందిన ప్రముఖ పద్యకవి, సాహితీవేత్త విష్ణుమొలకల భీమేశ్వర ప్రసాద్, మండలంలోని కొలకలూరుకు చెందిన సాహితీరత్న నూతక్కి పూర్ణప్రజ్ఞాచారికి తెలుగు తేజం జాతీయ పురస్కారాలను ప్రదానం చేశారు. దుశ్శాలువ, జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు గొట్టిముక్కల చెన్నకేశవులు, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఎ.నాగేశ్వరరావు, కార్యక్రమ సంధానకర్త ధనాశి ఉషారాణి, డాక్టర్ రంగిసెట్టి రమేష్ సమక్షంలో పురస్కారాలను ప్రదానం చేశారు. తొలిగా 'మాతృభాష పరిరక్షణ–కవుల కర్తవ్యం' అంశంపై కవి సమ్మేళనం నిర్వహించారు.

జైన్ కాలేజీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం





సమ్మేళనంలో పాల్గొన్న నాటి పూర్వ విద్యార్థులు

తెనాలి: మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని విదిషలో గల ఎస్ఎస్ఎల్ జైన్ కాలేజీ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని గౌతమ్ గ్రాండ్ హోటల్‌లో సందడిగా జరిగింది. 1970లో పీజీ చదువుకున్న విద్యార్థులందరూ 50 ఏళ్ల తర్వాత రీ యూనియన్ సమావేశాలు జరుపుకుంటూ ఏడాదికోసారి అందరూ కలుసుకుంటున్నారు. ఆత్మీయతను పంచుకుంటూ ఆనందంగా నాటి జ్ఞాపకాలతో గడుపుతున్నారు. అందులో భాగంగా ఇప్పటికి నాలుగు సార్లు పలుచోట్ల ఈ ఆత్మీయ సమ్మేళనాలు జరుపుకున్నారు. ఇప్పుడు అయిదోసారి తెనాలిలో ఒకే వేదికపై ఆనాటి మిత్రులందరూ కలుసుకుని సందడి చేశారు. అప్పట్లో పీజీ చేసిన వారందరూ వేర్వేరు రాష్ట్రాలకు చెందినవారు. ప్రస్తుతం వారంతా వివిధ రంగాల్లో వివిధ హోదాల్లో సేవలందించి విశ్రాంత జీవితం గడుపుతున్నా రు. వారిలో దాదాపు 100 మంది మిత్రులు ఆదివారం నాటి సమ్మేళనంలో పాల్గొన్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఎక్కడెక్కడో దూరప్రాంతాల్లో ఉంటున్న వారు సైతం ఆత్మీయ సమ్మేళనానికి తరలి వచ్చారు. కొందరు కుటుంబ సమేతంగా హాజరై, మిత్రులకు వారిని పరిచయం చేసుకున్నారు. కాలేజీ రోజులను గుర్తు చేసుకున్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని తెనాలికి చెందిన అప్పటి విద్యార్థులు పర్యవేక్షించారు. వీరిలో ఎస్. ద్వారకానాథ్, టి. సుధాకర్, ప్రభాకర్ రెడ్డి, ప్రసాద్ సుబ్బారెడ్డి, కోగంటి వెంకటేశ్వరరావు, బాబుల్ రెడ్డి, గుమ్మడి రాజేంద్ర ప్రసాద్, జేకే బాపిరెడ్డి, విజయలక్ష్మి, స్వర్ణ కుమారి ఉన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడి అమానుషం

- ఉప ముఖ్యమంత్రి బంగ్లాదేశ్ రావాలి
- విశ్వహిందూ పరిషత్ సభ్యులు

తాడేపల్లిరూరల్ : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు చాలా అమానుషమని, ఆ దేశంలో హిందువులపై, మహిళలపై చాలా దారుణంగా దాడి చేసి మారణకాండను సృష్టిస్తున్నారని, ప్రపంచ దేశాలు కలగజేసుకుని దాడులను ఆపాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు కల్యాణ్ స్వామీజీ అన్నారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని భరతమాత సెంటర్ నుంచి ఓల్డ్ టోల్ గేటు, అక్కడ నుంచి జాతీయ రహదారి వెంబడి కుంచనపల్లిలోని వెంకటేశ్వరస్వామి దేవాలయం వరకు హిందువులపై దాడులను నిరసిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణ్ స్వామీజీ మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో నివసిస్తున్న హిందువులపై ముస్లింలు దాడులు ఆపకపోతే ఇండియాలో ఉన్న రొహింగ్యా ముస్లింలను వారి దేశానికి వెళ్లే వరకు తరిమి కొడతామని హెచ్చరించారు. బంగ్లాదేశ్‌లో హిందువుల పరిరక్షణకు పోరాడుతున్న చిన్మయదాసు అరెస్ట్‌పై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించడం చాలా మంచి పరిణామమన్నారు. పవన్ కల్యాణ్ మరో అడుగు ముందుకు వేసి బంగ్లాదేశ్ పర్యటించి హిందువులపై జరుగుతున్న దాడులను అడ్డుకోవాలని, బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ప్రపంచ దేశాలకు తెలిసే విధంగా ప్రచారం నిర్వహించి, ఈ దాడులను అన్ని దేశాల వారు ఖండించాలన్నారు. వెంటనే దాడులను ఆపకపోతే విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఆందోళన నిర్వహించడంతో పాటు భవిష్యత్తులో ఇక్కడ ఉన్న రొహింగ్యా ముస్లింలను దేశం నుంచి తరిమి కొట్టేందుకు పునరుద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగ్యేశ్వరరావు, రామిరెడ్డి, చిరంజీవి, బాలు, మోదుగుల కోటిరెడ్డి, శుభోఖర్, ఇప్పటం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కార్మికులు పట్టుదలగా ఉద్యమాన్ని కొనసాగించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు



కార్మికులతో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రామరావు

తాడేపల్లిరూరల్ : ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమ నష్టపరిహారం కోసం నిర్వహిస్తున్న దీక్షలను పట్టుదలగా కొనసాగించాలని జిల్లా కార్యదర్శి పాశం రామరావు అన్నారు. ఆదివారం బ్రహ్మానందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ కార్మికులను చర్చలకు పిలవడం మంచి పరిణామమమని, అయితే ప్రజా దర్బార్‌లో ఇది తేలే సమస్య కాదన్నారు. ప్రత్యేకంగా మంత్రి నారా లోకేష్ చొరవ చూపించి కార్మికుల సమస్యను పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. దీక్షా శిబిరంలో దామవరపు నాగేశ్వరరావు, వై. సాంబయ్య, ఆర్.ఇశ్రాయెల్, ఎ.నాగేశ్వరరావు, ఎస్కే ఆరిఫ్, సీఐటీయూ కార్యదర్శి వేముల దుర్గారావు, బి.వెంకటేశ్వర్లు, ఏఐఎఫ్‌టీయూ నాయకులు కె.కోటయ్య, కె.ఆదినారాయణ, కార్మిక నాయకులు కె.స్టీవెన్, అంకయ్య, ఎం.ఆశీర్వాదం, రమాదేవి, శారద, దుర్గా భవాని, బాషా పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటు దరఖాస్తుకు నేడు చివరి అవకాశం

తెనాలి రూరల్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేందుకు సోమవారం చివరి అవకాశమని అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2021 నవంబరు ఒకటో తేదీలోపు డిగ్రీ పట్టా కలిగిన వారు ఫారం– 18తో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితా అందుబాటులో ఉందని, పరిశీలించుకుని అభ్యంతరాలను ఫారం –7 ద్వారా తెలియజేయవచ్చని తెలిపారు.

• ఉషోదయాన పొగమంచు 'చలి'గింత





శీతాకాలం చలి వణికిస్తోంది. వేకువజాము నుంచి కురుస్తున్న మంచు రోడ్లను కప్పేస్తోంది. తెల్లవారాక కూడా దట్టంగా కమ్ముకున్న పొగమంచులో ఎదురుగా ఏమీ కనిపించని పరిస్థితి. వాహనాలు లైట్లు వేసుకుని ప్రయాణిస్తున్నాయి. బుర్రిపాలెంరోడ్డులో ఉదయం 6.30 గంటలకు తీసిన ఫొటోలివి.

– తెనాలి